ప్రగతి కేంద్రం.. పంటపాళెం

- డీబీటీ–నాన్ డీబీటీ లబ్ధి రూ.19 కోట్లు
- ఐదేళ్లలో మూడు పరిశ్రమలు ఏర్పాటు
- స్థానికులకు మెండుగా ఉపాధి

ముత్తుకూరు : మండలంలోని పంటపాళెం పంచాయతీలో ఈ ఐదేళ్ల వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పారిశ్రామిక ప్రగతి పరుగులు తీసింది. ఉద్యోగ– ఉపాధి అవకాశాలు సమృద్ధిగా లభించడంతో స్థానికుల జీవన ప్రమాణాలు మెరుగుపడ్డాయి. ముఖ్యంగా ప్రతివీధిలో నిర్మాణమైన సీసీరోడ్లు, సైడు డ్రెయిన్లు పంచాయతీకే వన్నె తెచ్చాయి. మనబడి నాడు–నేడు ద్వారా పాఠశాలలకు కొత్త హంగులు వచ్చాయి. కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు, విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లు సరికొత్త వెలుగులు నింపాయి. ఊటల సంఘం సమీపంలో ఏర్పడిన జగనన్న కాలనీ సరికొత్త గ్రామంగా రూపుదాల్చింది. 83 పక్కాగృహాలు మంజూరు కాగా, ఇందులో 72 పక్కాఇళ్లు గృహ ప్రవేశాలకు నోచుకున్నాయి. ఇటీవల రూ.22 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.24 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను రాష్ట్ర మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ప్రారంభించారు.



పంటపాళెంలో నిర్మించిన రైతు భరోసా కేంద్రం

పారిశ్రామికంగా అభివృద్ధి

దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో పంటపాళెంలో పామాయిల్ ఫ్యాక్టరీల నిర్మాణం పురుడుపోసుకుంది. ఇక్కడి నుంచి ఇతర రాష్ట్రాలకు పామాయిల్ రవాణా ప్రారంభమైంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో బొంగె ఆయిల్స్, అనా ఆయిల్స్, కోస్టల్ ఆయిల్స్ తదితర ఫ్యాక్టరీల నిర్మాణం జరిగింది. పామాయిల్ ఫ్యాక్టరీల ఏర్పాటుతో పంటపాళెం పంచాయతీ రూపురేఖలు మారిపోయాయి. నూతన భవన నిర్మాణాలు జరిగాయి. వివిధ రకాల దుకాణాలు వెలిశాయి. భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెరుగుపడ్డాయి. ఫ్యాక్టరీల సామాజిక బాధ్యత(సీఎస్సార్) నిధులు రూ.లక్షల వ్యయంతో బస్‌షెల్టర్లు, ఆర్వో ప్లాంట్లు, పాఠశాలలకు అదనపు గదులను ఏర్పాటు చేశారు.

పంటపాళెం సచివాలయ పరిధిలో..

డీబీటీ ద్వారా పేదలకు జరిగిన లబ్ధి
రూ.11,75,30.604

నాన్ డీబీటీతో జరిగిన లబ్ధి
రూ.7,26,37,838



ఇటీవల నిర్మించిన విలేజ్ క్లినిక్



నాడు–నేడు ద్వారా రూపుమారిన స్కూల్ భవనం



ఊటల వద్ద నిర్మించిన జగనన్న కాలనీ

40 అంకణాల స్థలం ఇచ్చాను



సొంత ఊరికి మంచి చేయాలన్న తలంపుతో తల్లిదండ్రులు మారు సరోజనమ్మ, దశరథరామిరెడ్డి జ్ఞాపకార్థం రూ.20 లక్షల విలువైన 40 అంకణాల స్థలం అందజేశాను. ఇందులో ఆర్బీకే భవన నిర్మాణం జరిగింది.

– మారు సుధాకరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత. పంటపాళెం.

ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయి



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పంచాయతీలో మౌలిక సదుపాయాలు ఏర్పాటయ్యాయి. పారిశ్రామిక ప్రగతి వల్ల ఉద్యోగ–ఉపాధి అవకాశాలు మెరుగుపడ్డాయి. పేదల జీవన ప్రమాణాలు పెరిగాయి.

– రావి విజయకుమార్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు.

మెండుగా విద్య, వైద్య సదుపాయాలు



వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రభుత్వ పాఠశాల రూపురేఖలు మారిపోయాయి. విలువైన విద్య పేదలకు అందుబాటులోకి వచ్చింది. విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పించారు. వైద్య సదుపాయాలు మెరుగుపడ్డాయి.

– తిన్నెలపూడి బ్రహ్మానందం, ఉపసర్పంచ్

సకల సౌకర్యాలు



రాష్ట్ర మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సహకారంతో పంచాయతీలో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాం. ఎక్కడా తాగునీటికి కొరత లేకుండా చర్యలు తీసుకున్నాం. ప్రతి వీధిలో సీసీరోడ్లు–డ్రెయిన్ల నిర్మాణం పూర్తి చేశాం.

– ఆలపాక శ్రీనివాసులు, సర్పంచ్, పంటపాళెం

క్లుప్తంగా

నేడు మంత్రి కాకాణి ఎన్నికల ప్రచారం

తోటపల్లిగూడూరు : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సోమవారం మండలంలో ఎన్నికల ప్రచారం చేస్తారని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు ఉప్పల శంకరయ్యగౌడ్ తెలిపారు. సోమవారం సాయంత్రం 4 గంటలకు తోటపల్లిగూడూరు, 5 గంటలకు ఇస్కపాళెం, 6 గంటలకు తోటపల్లి పంచాయతీల్లో ఎన్నికల ప్రచారం సాగుతుందన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

మనుబోలమ్మకు ప్రత్యేక పూజలు



పూజలో పాల్గొన్న మంత్రి కాకాణి

మనుబోలు : మండల కేంద్రంలోని మనుబోలమ్మకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురిసి రైతులు పండించిన ధాన్యానికి గిట్టుబాటు ధర లభించడంతో వైఎస్సార్‌సీపీ నేత, ఉప సర్పంచ్ కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు పొంగళ్లు పొంగించి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకుడు సాయిశర్మ అమ్మవారికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే పక్కనే ఉన్న నాగార్పమ్మ, గంగమ్మ ఆలయాల్లో కూడా మంత్రి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం వద్ద అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఉభయకర్తలుగా చంద్రశేఖర్‌రెడ్డితో పాటు దువ్వూరు బ్రదర్స్ వారు వ్యవహరించారు.

శేష జీవితం హాయిగా సాగాలి



కృష్ణమూర్తిని సన్మానిస్తున్న అధికారులు, నాయకులు

కోవూరు : ఉద్యోగ విరమణ జీవితంలో భాగమే అని, శేషజీవితం హాయిగా సాగాలని డీఎల్‌డీఏ డైరెక్టర్ కాటంరెడ్డి దినేష్‌రెడ్డి అన్నారు. మండలంలోని పడుగుపాడు పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న పాటూరి కృష్ణమూర్తి ఆదివారం పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా పడుగుపాడులో ఏర్పాటు చేసిన అభినందన సభలో పలువురు వక్తలు మాట్లాడారు. కృష్ణమూర్తి పంచాయతీ కార్యదర్శిగా నిష్పక్షపాతంగా పనిచేశారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చౌటూరి లక్ష్మీనారాయణ, ఉపసర్పంచ్ అహ్మద్, జెడ్పీటీసీ శ్రీలత, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాంక్ ఉద్యోగుల సమావేశం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): బ్యాంక్ ఉద్యోగులతో సమావేశాన్ని నెల్లూరు జిల్లా బ్యాంక్ ఉద్యోగుల సమన్వయ సంఘ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. ఆలిండియా బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జాతీయ కార్యదర్శి రాంబాబు, ఉదయ్‌కుమార్, రమణప్రసాద్, సుమన్ పాల్గొన్నారు.

పేద మహిళలకు చీరల పంపిణీ



ముత్తుకూరు : ఈస్టర్ పండగ సందర్భంగా ముత్తుకూరులోని చర్చిలో పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ చర్చి ద్వారా ఆంధ్రప్రదేశ్ పాస్టర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు పాస్టర్ జెర్మియా, డీఎస్పాల్, ఏసురత్నం, ఏలియాలు వంద మంది మహిళలకు చీరలు అందజేశారు. యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ చర్చి ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు పాస్టర్ జెర్మియా ఈ సందర్భంగా తెలిపారు. ఇండియన్ క్రిస్టియన్ బోర్డు జిల్లా సభ్యులు వాణి, సీహెచ్ ఇమానియేల్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్

విడవలూరు : స్థానిక తెలుగు బాప్టిస్టు చర్చిలో ఈస్టర్ వేడుకలను ఆదివారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాస్టర్ బి.లూకరాజు దైవ సందేశం ఇచ్చారు. అనంతరం చర్చి ప్రాంగణంలో గ్రామస్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

గిరిజన సభను విజయవంతం చేయండి

కోవూరు : మండలంలోని పడుగుపాడు జాతీయ రహదారి సమీపంలో సోమవారం ఉదయం జరుగనున్న గిరిజన ఆత్మీయ సమావేశాన్ని విజయవంతం చేయాలని డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. ఈ మేరకు వారు ఆదివారం మాట్లాడుతూ భారీ ఎత్తున జరిగే గిరిజన ఆత్మీయ సమావేశానికి రాజ్యసభ సభ్యులు వేణుంబాక విజయసాయి రెడ్డి, బీద మస్తాన్‌రావు, కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు బల్లి కళ్యాణ్ చక్రవర్తి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, గిరిజన పెద్దలు తదితరులు హాజరవుతారన్నారు.

కొత్త సబ్‌స్టేషన్‌ను నిర్మిస్తాం

- పూడిపోయిన కాలువలకు రిపేర్లు చేయిస్తాం
- మంత్రి కాకాణి హామీ

పొదలకూరు : నావూరు, నావూరుపల్లి, చెన్నారెడ్డిపల్లి తదితర గ్రామాల్లో నాణ్యమైన వ్యవసాయ విద్యుత్ సరఫరా కోసం కొత్త సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయిస్తానని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి హామీ ఇచ్చారు. మండలంలోని భోగసముద్రం, చెన్నారెడ్డిపల్లి, నావూరు, నావూరుపల్లి గ్రామాల్లో ఆదివారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో మాట్లాడుతూ వ్యవసాయ యోగ్యమైన విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు రైతులు తన దృష్టికి తీసుకొచ్చారని, తిరిగి అధికారంలోకి వచ్చిన వెంటనే సబ్‌స్టేషన్ నిర్మాణానికి శ్రీకారం చుడుతామన్నారు. నావూరు చెరువుకు దక్షిణ కాలువ ద్వారా సాగునీటిని అందించే కాలువలు పూడిపోయినట్లు గ్రామస్తులు వినతిపత్రం సమర్పించారని ఎన్నికలు పూర్తయిన తర్వాత కాలువను ఆధునికీకరిస్తామన్నారు. గ్రామాల్లో సిమెంటురోడ్లు, సైడ్ డ్రెయిన్లను నిర్మించినట్లు పేర్కొన్నారు. ఈ ప్రాంత ప్రజల అవసరాలు తెలుసని, అందుకే పెద్దఎత్తున అభివృద్ధి చేసినట్లు చెప్పారు. రైతులకు అందజేసిన అసైన్‌మెంట్ పట్టాలు వెబ్‌ల్యాండ్‌లో అప్‌లోడ్ అవుతాయన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మంత్రి పర్యటన సందర్భంగా మహిళలు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు.



వృద్ధురాలిని పలుకరిస్తున్న మంత్రి గోవర్ధన్‌రెడ్డి

వలంటీర్ల ఫోన్‌లను స్వాధీనం చేయాలి

మనుబోలు : గ్రామ వలంటీర్లకు ప్రభుత్వం ఇచ్చిన సెల్‌ఫోన్‌లను ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు సిమ్ కార్డులతో సహా స్వాధీనం చేయాలని ఈఓపీఆర్డీ వెంకటరమణ కోరారు. మనుబోలు మండల కేంద్రంలో పలువురు వలంటీర్ల నుంచి ఫోన్‌లు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. మండలంలో మొత్తం 216 మంది వలంటీర్ల వద్ద సెల్‌ఫోన్‌లు ఉన్నాయని, వీరిలో ఇప్పటి వరకు 160 ఫోన్‌లు స్వాధీనం చేశారని తెలిపారు. మిగిలిన వారు కూడా ఇచ్చేయాలని సూచించారు. ఎన్నికల అనంతరం ఫోన్‌లను తిరిగి అందజేస్తామని తెలిపారు.

సచివాలయ సిబ్బందితో పింఛన్ల పంపిణీ

ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మండలంలో సచివాలయ సిబ్బందితో మార్చి నెల పింఛన్ పంపిణీ చేస్తామని ఎంపీడీఓ ప్రసాద్ తెలిపారు. ఆదివారం తన కార్యాలయంలో మాట్లాడుతూ ఏప్రిల్ 3 నుంచి 8వ తేదీ వరకు పింఛన్లను పంపిణీ చేస్తామన్నారు.



వలంటీర్ నుంచి సెల్‌ఫోన్ తీసుకుంటున్న ఈఓపీఆర్డీ వెంకటరమణ

వైఎస్సార్‌సీపీలో ఉపసర్పంచ్ చేరిక



గోపాలయ్యతో రజత్‌కుమార్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని మినగల్లులో ఉప సర్పంచ్ పిన్నిక గోపాలయ్య టీడీపీకి రాజీనామా చేసి వైఎస్సార్‌సీపీ కోవూరు యువజన విభాగం అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా రజత్‌కుమార్‌రెడ్డి ఆయనకు పార్టీ కండువా వేసి ఆహ్వానం పలికారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి పార్టీలో చేరినట్లు గోపాలయ్య తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చెర్లో సతీష్‌రెడ్డి, పార్టీ నేతలు మధు, అనిల్‌రెడ్డి, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

త్యాగరాజస్వామికి గాన నీరాజనం



నెల్లూరు(బృందావనం): నగరంలోని పుర మందిరంలో త్యాగరాజ స్మరణోత్సవాలను భిక్షాటన పూర్వక త్యాగరాజ స్మరణోత్సవ సభ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. కోదండరామ స్వామి అలంకారంలో స్వామివారు దర్శనమిచ్చారు. చెన్నైకి చెందిన ప్రముఖ సంగీత విద్వాంసులు పాతంగి సోదరుల గాత్రం అలరించింది. బద్రినారాయణ్, మాలి వాద్య సహకారం అందించారు. స్థానిక కళాకారులు ఆలపించిన త్యాగరాజ కీర్తనలు, పంచరత్నగోష్ఠి, వీణానాదం, హరికథలు అలరించాయి.

భగవద్గీత ప్రతుల పంపిణీ



భగవద్గీత ప్రతులతో స్థానికులు

మనుబోలు : మండలంలోని గురవిందపూడి, అనుపల్లిపాడు గ్రామాల్లో ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రతులను ప్రజలకు పంపిణీ చేశారు. ఏప్రిల్ 5న ప్రబోధానంద యోగీశ్వరులు జన్మదినం సందర్భంగా ముమ్మర ప్రచారం చేస్తున్నట్లు సమితి ప్రతినిధులు తెలిపారు. భగవద్గీత ప్రతి ఒక్కరి జీవితంలో కార్యదక్షత, మంచి నడవడిక, నైతిక ప్రవర్తనకు మార్గదర్శిగా పనిచేస్తుందన్నారు. ఫలితం ఆశించకుండా కర్మ చేయడం గీత నేర్పుతుందన్నారు.

అభివృద్ధిని చూసి ఆదరించండి



పొదలకూరు : ఎన్నికల ప్రచారం చేస్తున్న పూజిత, వైఎస్సార్‌సీపీ నేతలు



బుచ్చిరెడ్డిపాళెం రూరల్: వడ్డిపాళెం గ్రామంలో..



కోవూరు : గంగవరంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న పార్టీ నేతలు

- వైఎస్సార్‌సీపీ నేతల ఇంటింటి ప్రచారం

పొదలకూరు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతి గ్రామంలో జరిగిన అభివృద్ధిని చూసి ఆదరించాలని మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె పూజిత పేర్కొన్నారు. పట్టణంలోని పుట్టాయగుంట, రామ మందిరం, స్టేట్ బ్యాంక్ వీధి ప్రాంతాల్లో పూజిత ఇంటింటి ఎన్నికల ప్రచారం ఆదివారం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణాన్ని సుందరీకరించే ప్రయత్నంలో రోడ్లు, సైడ్‌డ్రెయిన్లు పూర్తిస్థాయిలో నిర్మించామని తెలియజేశారు. రూ.2 కోట్లు వెచ్చించి మెయిన్‌రోడ్డును నిర్మించామన్నారు. మీ కుటుంబంలో ఒకరిగా మంత్రి కాకాణి అభివృద్ధి పనులు చేశారన్నారు. ఆయనను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఆమె వెంట జెడ్పీటీసీ నిర్మలమ్మ, ఎంపీటీసీలు జి.లక్ష్మీకల్యాణి, జి.శ్రీనివాసులు, సర్పంచ్ చిట్టెమ్మ, వార్డు సభ్యులు ఆకులూరు అనూరాధ, నాయకులు మందా రామిరెడ్డి, తుమ్మల ప్రసాద్, ఆకులూరు హేమంత్‌కుమార్, భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

వడ్డిపాళెంలో..

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: మండలంలోని ఇస్కపాళెం గ్రామ పంచాయతీ వడ్డిపాళెంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కోడూరు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని టీడీపీకి చెందిన సునీత, ఎస్తేరియా, షేక్ నస్రీన్ వైఎస్సార్‌సీపీలో చేరారు. అనంతరం మధుసూదన్‌రెడ్డి మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, విజయసాయిరెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కె.వెంకటేశ్వర్లు, ఆదిశేషయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆశీర్వదించండి

కోవూరు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందాయని, మేలు చేసిన పార్టీని ఆశీర్వదించాలని సర్పంచ్ లక్ష్మీకుమారి అన్నారు. మండలంలోని గంగవరం గ్రామంలో ఆమె ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల సంక్షేమానికి జగనన్న ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీగా వేణుంబాక విజయసాయిరెడ్డిని, కోవూరు ఎమ్మెల్యేగా నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఆమె వెంట ఉపసర్పంచ్ మోషే, పార్టీ నేతలు జ్యోతి, చెన్నయ్య, ఇతర నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు

వెంకటాచలం : మండలంలోని కాకుటూరు గ్రామంలో టీడీపీ నుంచి 80 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. గ్రామానికి చెందిన మల్లి మహేంద్ర, జానా వెంకటేష్, అశోక్, మురళి, పచ్చబట్ల శివ, గోపి తదితరులతో పాటు 80 కుటుంబాలు ఆదివారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నెల్లూరులో కలిశారు. తామంతా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుతీరుకు ఆకర్షితులమై వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు ప్రకటించారు. దీంతో మంత్రి కాకాణి వారికి వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాకుటూరులో ఇప్పటికే వైఎస్సార్‌సీపీ చాలా బలంగా ఉంది. కాగా టీడీపీకి చెందిన 80 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరడంతో ఆ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది.

వరిగొండ నుంచి చేరిక

తోటపల్లిగూడూరు : మండలంలోని వరిగొండ పంచాయతీ రావూరువారికండ్రిగకు చెందిన 70 కుటుంబాలు ఆదివారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన ముఖ్య నాయకుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ నాయకులు అంజిబాబు, కటకం కిరణ్, రమేష్, ఎందోటి వెంకటరమణయ్య, నిమ్మల శీనయ్య తదితరులు ఉన్నారు. వీరంతా ఇటీవలే వైఎస్సార్‌సీపీని వీడి టీడీపీలో చేరారు. అయితే రెండు రోజులు కూడా టీడీపీలో ఇమడలేక ఆ పార్టీకి గుడ్‌బై చెప్పేశారు. ఈ క్రమంలో ఆదివారం మంత్రి కాకాణి నివాసానికి చేరుకుని తన తప్పును సరిదిద్దుకుంటూ తిరిగి వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి కాకాణి మాట్లాడుతూ పార్టీలో చేరిన కార్యకర్తలకు అండగా ఉంటామని, సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నెల్లిపూడి సునీల్‌కుమార్‌రెడ్డి, జానా శేషు, జానా చరణ్, మీరా మొహిద్దీన్, అశోక్‌కుమార్‌రెడ్డి, శేఖర్‌బాబు, ప్రద్యుమ్నరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వెంకటాచలం : టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో మంత్రి కాకాణి



తోటపల్లిగూడూరు : వైఎస్సార్‌సీపీలో చేరిన వరిగొండ నేతలతో మంత్రి